సాక్షి
జగిత్యాల
శుక్రవారం, 6, అక్టోబర్, 2023

పట్టుబట్టారు.. కొలువు కొట్టారు

గొల్లపల్లి: యువతరం కల సాకారమైంది. ఖాకీ కొలువు చేయాలన్న లక్ష్యం నెరవేరింది. వారి కష్టానికి ఫలితం లభించింది. సర్కారు కొలువు సాధించడంతో ఆయా కుటుంబాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. బుధవారం రాత్రి వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో జిల్లాలోని పలువురు యువత సత్తాచాటారు. పేద, మధ్యతరగతికి చెందిన ఎందరో ఖాకీ కొలువు సాధించి.. శభాష్ అనిపించుకున్నారు.

– వివరాలు 8లో



న్యూస్‌రీల్

'ఆశా'ల కలెక్టరేట్ ముట్టడి

● అడ్డుకున్న పోలీసులు



ఆశాలను అడ్డుకుంటున్న పోలీసులు

జగిత్యాలటౌన్: ఆశావర్కర్లకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైటాయించి నిరసనకు దిగారు. పారితోషికం వద్దని, కనీస వేతనం ముద్దు అని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్యంతోపాటు ప్రభుత్వ పథకాల అమలులో పాలుపంచుకుంటున్న ఆశావర్కర్లను సర్కారు చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనంగా రూ.18వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్‌కార్డులు, ఈఎస్‌ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు.

సీఎంకు ఈ-పంచాయతీ ఆపరేటర్ల లేఖలు



ఉత్తరాలు రాస్తున్న ఈ-పంచాయతీ ఆపరేటర్లు

జగిత్యాలటౌన్: తమకు పే స్కేల్ అమలు చేయాలని కోరుతూ ఈ-పంచాయతీ ఆపరేటర్లు చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరింది. ఇందులో భాగంగా సీఎం కేసీఆర్‌కు ఉత్తరాలు రాసి నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, డీపీఎం సాంబశివ మాట్లాడుతూ వారంరోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. జిల్లా అధ్యక్షుడు గొట్టె రమేశ్, నాయకులు పల్లికొండ సంతోష్‌కుమార్, గంగమల్లు, వెంకటరమణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం కోసం భూసార పరీక్షలు



మల్లెగుట్ట వద్ద భూసార పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్న శాస్త్రవేత్తలు

మల్యాల: జిల్లాకు కేటాయించిన కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు మండలకేంద్రంలోని మల్లెగుట్ట వద్దగల ప్రభుత్వ స్థలంలో గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన శాస్త్రవేత్తలు భూసార పరీక్షలు చేశారు. శాస్త్రవేత్తలు భాస్కర్‌రావు, కిరణ్‌కుమార్ కొంత మట్టిని సేకరించి పరీక్షల నిమిత్తం తీసుకెళ్లారు. ఇక్కడ కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటైతే ఉద్యాన పంటల సాగుకు ఊతం లభించనుంది. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయి. రైతు శిక్షణ కార్యక్రమాలు, విత్తనాలపై పరిశోధనలు జరుగుతాయి.

ఆంక్షలు లేకుండా జీవనభృతి ఇవ్వాలి



ఆర్డీవో ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

కోరుట్ల: బీడీ కార్మికులకు ఆంక్షలు లేకుండా జీవనభృతి అందించాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె నరేందర్ అన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం బీడీ కార్మికులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాలో సుమారు లక్ష మంది బీడీ కార్మికులు ఉన్నారని, ఇతర కార్మికులతో పోల్చితే వారికి వేతనం తక్కువగా వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న, రాజేశ్వర్, ముత్తన్న, సత్యక్క, ప్రసాద్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల కల సాకారం

● కోరుట్లలో వంద పడకలు ఆసుపత్రి రెడీ
● నేడు ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు
● విస్తరించనున్న వైద్య సేవలు



కోరుట్లలోని వంద పడకల ఆసుపత్రి భవనం

కోరుట్ల: కోరుట్ల వాసుల పదేళ్ల కల సాకారం అవుతోంది. వంద పడకలు ఆసుపత్రితోపాటు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆసుపత్రికి శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. ఈ ఆసుపత్రి నుంచి కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి పరిసర మండలాల ప్రజలకు పూర్తిస్థాయి ప్రభుత్వ వైద్యం అందనుంది.

రూ.16 కోట్ల వ్యయం

25 ఏళ్ల క్రితం పది పడకలుగా ఉన్న ఆసుపత్రి 15 ఏళ్ల క్రితం 30 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. అదే సమయంలో పాత భవనం నుంచి కొత్త భవనంలోకి మారింది. క్రమంగా రోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రసవాల సంఖ్య పెరగడం.. కేసీఆర్ కిట్లు, ప్రసూతిసాయం వంటి పథకాలు అమల్లోకి రావడంతో వంద పడకలుగా మార్చాలన్న డిమాండ్ ఊపందుకుంది. ఏడాది క్రితం డయాలసిస్ యూనిట్ కూడా ఈ ఆసుపత్రిలో ఏర్పాటు చేయడంతో మరింత రద్దీ పెరిగింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు చొరవ తీసుకుని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల కొత్త భవనం నిర్మాణానికి ఏడాది క్రితం రూ.16కోట్లు మంజూరు చేయించారు. వీటితోపాటు మరో రూ.5 కోట్ల నిధులు ఆసుపత్రిలో పరికరాల కోసం కేటాయించారు. ఈ క్రమంలో కొత్త భవనం నిర్మాణం పూర్తి కాగా.. శుక్రవారం మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా ప్రారంభించడానికి సిద్ధం చేశారు.

విస్తరించనున్న వైద్యసేవలు

కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలకు పెంచడంతో అదనంగా వైద్యులు, వసతులు అందుబాటులోకి రానున్నాయి. అల్ట్రాసౌండ్, ఈఎన్‌టీ, ఆర్థో, అప్తాలమిస్ట్, జనరల్ సర్జరీ, ఎక్స్‌రే యూనిట్లు, నాలుగు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తారు. వీటికి సంబంధించిన పరికరాలు ఒక్కొక్కటిగా కోరుట్లకు చేరుకుంటున్నాయి. ఆసుపత్రి భవనం ప్రారంభించిన నెల వ్యవధిలోనే పరికరాలను బిగించి పూర్తిస్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తేనున్నారు.

పెరగనున్న వైద్యులు, సిబ్బంది

- ప్రస్తుతం కోరుట్ల ఆసుపత్రిలో 11 మంది వైద్యులున్నారు. తాజాగా మరో 13 మంది వైద్యులు నియామకం కానున్నారు.
- వీరంతా ఆయా విభాగాల్లో స్పెషలైజేషన్ పూర్తి చేసిన వారు కావడం విశేషం.
- రెగ్యులర్ డ్యూటీ డాక్టర్లు, రేడియోగ్రాఫర్, ల్యాబ్ టెక్నీషియన్స్‌ను భర్తీ చేస్తారు.
- మొత్తం స్టాఫ్‌నర్సులు 18 మంది అవసరం కాగా.. ప్రస్తుతం 8 మంది మాత్రమే ఉన్నారు. మరో పది మంది స్టాఫ్‌నర్సులు రానున్నారు.
- ఆఫీస్ సబార్డినేట్లు ఇతరత్రా కిందిస్థాయి ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించనున్నారు.

పూర్తిస్థాయి వైద్య సేవలు



కోరుట్లలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుతో కోరుట్ల, కథలాపూర్, మల్లాపూర్, మేడిపల్లి మండలాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకొస్తాయి. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చొరవతో డయాలసిస్ సెంటర్, వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశాం. గత ఎన్నికల్లో కోరుట్ల ఆసుపత్రిని వంద పడకలు చేస్తామన్న హామీ నెరవేర్చాను.

– ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

నేడు జిల్లాకు మంత్రి హరీశ్‌రావు

జగిత్యాల: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు జిల్లాలోని కోరుట్ల పట్టణంలో పర్యటించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్‌బాషా, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తెలిపారు. కోరుట్లలో నిర్మించిన 100 పడకల ఆస్పత్రి ప్రారంభిస్తారని, మినీస్టేడియంలో ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారని పేర్కొన్నారు.

నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం



రాయికల్: జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



జగిత్యాల రూరల్: బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తూ..

● ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రాయికల్ మండలం సింగరావుపేటలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. స్పోర్ట్స్ కిట్లు అందించారు. తాట్లవాయి, భూపతిపూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. నిరుపేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారని గుర్తుచేశారు. రైతుబంధు, రైతుబీమా, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ధాన్యం కొనుగోళ్లు చేస్తూ అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయ మాటలు చెబుతారని, ప్రజలు నమ్మి మోసపోవద్దని కోరారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఏఎంసీ చైర్మన్ మారంపల్లి రాణి, సర్పంచులు రాంచందర్‌రావు, జక్కుల చంద్రశేఖర్, రాగి సాగరిక, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ ఖయ్యూం పాల్గొన్నారు.

తెలంగాణ పండుగ బతుకమ్మ

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలో బతుకమ్మ చీరలు, కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని తెలిపారు. జెడ్పీటీసీ మహేశ్, సర్పంచ్ సురకంటి స్వప్న, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ మార్కెట్‌లో రూ.1.70కోట్లతో నిర్మించే కల్లాల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రూ.లక్ష రుణమాఫీతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్కెట్ చైర్ పర్సన్ నక్కల రాధ, ఎంపీపీ రాజు, సింగిల్ విండో చైర్మన్లు సందీప్‌రావు, మహిపాల్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆసిఫ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, సెక్రటరీ రాజశేఖర్, సర్పంచ్ గంగనర్సు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం.. సంక్షేమమే ధ్యేయ

సారంగాపూర్: అభివృద్ధే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో యువత స్పోర్ట్స్ కిట్లు, మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, ఎంపీడీవోలు రాజేందర్, ఏవీకే.రాజు, ఎంపీవో శశికుమార్ రెడ్డి, ఏపీఎం రాజయ్య పాల్గొన్నారు. ముందుగా కోనాపూర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

తెలంగాణాలో క్రీడా విప్లవం

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో 18 వేలకుపైగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతోపాటు కిట్లు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లాకేంద్రంలోని స్వామి వివేకానంద మినీస్టేడియంలో క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేశారు. కేసీఆర్ ప్రోత్సాహంతో తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ అనిల్, డీఈు రాజేశ్వర్, డీవైఎస్‌వో రవికుమార్, పీఈటీలు పడాల విశ్వప్రసాద్, క్రిష్ణప్రసాద్, అజయ్‌బాబు, కోచ్ శ్రీరాం, కౌన్సిలర్లు తోట మల్లికార్జున్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

జగిత్యాల: రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటైందని, జగిత్యాలలోనూ ప్రారంభించుకోవడం గర్వంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. మెడికల్ కళాశాల నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందాలని సీఎం కేసీఆర్ అన్ని వసతులతో వైద్య కళాశాలలను ఏర్పాటు చేశారని, డాక్టర్లుగా పేదలకు వైద్యం అందించాలని సూచించారు. ప్రిన్సిపల్ శివరాంప్రసాద్, సూపరింటెండెంట్ రాములు, వైస్ ప్రిన్సిపల్ ఎస్ఎస్.ఖాద్రి, రఘు పాల్గొన్నారు.

సీఎంఆర్ త్వరితగతిన చెల్లించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: వానాకాలం, యాసంగి 2021–22కు సంబంధించిన సీఎంఆర్ త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లత మిల్లర్లను ఆదేశించారు. 2022–23కు సంబంధించిన సీఎంఆర్‌కు వచ్చేనెల 30 వరకు ప్రభుత్వం గడువు పెంచిందన్నారు. గురువారం రైస్‌మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రా రైస్, బాయిల్డ్ రైస్ మిల్లర్లు సీఎంఆర్ పూర్తి చేయాలని, 50శాతం అప్పగించిన వారికే ఈ వానాకాలం ధాన్యం కేటాయింపులకు అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని, ఎఫ్‌సీఐ అధికారులు గోదాముల్లో అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోలీసుల పాత్ర కీలకం

● డీఎస్పీ వెంకటస్వామి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటస్వామి

జగిత్యాలక్రైం: ఎన్నికల నిర్వహణలో పోలీసులు పాత్ర కీలకమని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాలని డీఎస్పీ వెంకటస్వామి అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఎన్నికల నియమావళి, తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు సిబ్బందితో సమీక్షించారు. ఎన్నికల విధులకు సంబంధించి పోలీస్‌సెక్టార్ అధికారులను నియమించామని, పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రతి అంశంపై అధికారులు పరిజ్ఞానం కలిగి ఉండాలని, ఒకటికి రెండు సార్లు విషయాలను తెలుసుకోవాలన్నారు. పోలీసు అధికారులు పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలింగ్ కేంద్రాలపై అవగాహన కలిగి ఉండాలని, సమస్యాత్మక గ్రామాలను పర్యటించాలన్నారు. ఎన్నికల శిక్షకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ పడల తిరుపతి అధికారులకు నియమావళిపై అవగాహన కల్పించారు. సీఐలు నటేష్, ఆరీఫ్‌అలీఖాన్, ఎస్సైలు పాల్గొన్నారు.

పదోన్నతుల అనంతరమే బదిలీలు

● ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

జగిత్యాల: ఉపాధ్యాయుల పదోన్నతుల అనంతరమే బదిలీ ప్రక్రియ ఉంటుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నూతన జీహెచ్‌ఎంల సన్మానోత్సవంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన నూతన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు పాల్గొన్నారు.

పేదల ఆత్మగౌరవం కోసమే డబుల్ ఇళ్లు

● రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: పేదల్లో ఆత్మగౌరవం నింపేందుకే ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందిస్తోందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురిలో రూ.130.80 కోట్లతో నిర్మించిన 20 డబుల్ బెడ్‌రూం ఇళ్లను గురువారం లబ్ధిదారులకు అందించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. రాయపట్నంలో రూ.39 లక్షలతో నిర్మించిన 500 టన్నుల సామర్థ్యం గల గోదాం, తిమ్మాపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనం, రూ.5లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవనం, రూ.42 లక్షలతో నిర్మించిన కో–ఆపరేటివ్ సంఘ భవనాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. నేరెల్ల, గోవిందుపల్లె, దమ్మన్నపేట, దోనూర్, జైనాలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. పలువురు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

వెల్గటూర్: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని మంత్రి అన్నారు. మండలంలోని కప్పారావుపేటలో రూ.1.5 కోట్లతో పంచాయతీ భవనం, అంతర్గత సీసీ రోడ్లు, మాల సంఘ భవనం, స్తంభంపల్లి శివారులో రూ.2కోట్లతో అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్‌కు శంకుస్థాపనలు చేశారు. మంత్రి పర్యటనలో ప్రోటోకాల్ పాటించడం లేదని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. స్తంభంపల్లిలో హరితహోటల్‌ను మంత్రి ఈనెల 2న ప్రారంభించారు. శిలాఫలకంలో వెంకటాపూర్, పాశిగామ సర్పంచుల పేర్లు లేవని మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే అలా జరిగిందని, శిలాఫలకం మార్చుతామని మంత్రి హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

రాయపట్నంలో పోలీస్ చెక్‌పోస్ట్



రాయపట్నంలో ఏర్పాటుచేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్ చెక్‌పోస్టు

● త్వరలో ప్రారంభం

ధర్మపురి: మూడు జిల్లాలకు అనుసంధానమైన రాయపట్నం కూడలి వద్ద పోలీస్ బార్డర్ చెక్‌పోస్టు, కమాండ్ కంట్రోల్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. రాయపట్నం కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల మూడు జిల్లాలకు సరిహద్దు కావడంతో ఈ ప్రాంతం నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. గతంలో ఇక్కడ తాత్కాలికంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి తనిఖీలు చేసేవారు. అయితే అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు ఇక్కడ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. రెండు ప్రత్యేక గదులతోపాటు మరో స్టోర్ రూంను నిర్మించారు. సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉంచి.. వచ్చీపోయే వాహనాలు, అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు సుమారు రూ.3లక్షల వ్యయంతో ఆధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో జరిగే ప్రతి సంఘటనా హైదరాబాద్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. రాయపట్నం కూడలి వద్ద ప్రమాదాల నివారణకు, వాహనాల వేగాన్ని అదుపులో ఉంచేందుకు రోడ్ల మధ్యలో భారీ ఎత్తున భారీకేడ్లు ఏర్పాటు చేయనున్నారు. అన్ని సౌకర్యాలతో పూర్తి చేయబడిన చెక్‌పోస్టును జిల్లా పోలీస్ అధికారుల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

నిరంతర తనిఖీలు



రాయపట్నం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద నిరంతర తనిఖీలు కొనసాగుతాయి. ఎస్పీ ఆదేశాల చెక్‌పోస్టు ఏర్పాటు చేశాం. పోలీస్ కమాండ్ కంట్రోలు ద్వారా అసాంఘిక శక్తులకు చెక్ పెడతాం. ఆధునిక సాంకేతిక సీసీ కెమెరాలతో ప్రతి వాహనం నంబర్ ప్లేట్ క్యాప్చర్ చేయబడుతుంది. నంబర్ లేని వాహనాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– సీఐ రమణమూర్తి

4.47లక్షల ఎకరాల్లో పంటల సాగు

● అత్యధికంగా 3.07 లక్షల ఎకరాల్లో వరి
● వానాకాలం సాగు వివరాలు తేల్చిన వ్యవసాయ శాఖ



జగిత్యాలఅగ్రికల్చర్: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలోని రైతాంగం 4.47 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ సాగు లెక్కలు తేల్చింది. ఇందులో వరి సాగు 3.07లక్షల ఎకరాలతో మొదటి స్థానంలో ఉంది. మొక్కజొన్న 39,603 ఎకరాలు, పండ్ల తోటలు 64,154 ఎకరాలు, పత్తి 18,487ఎకరాల్లో, పసుపు 12,347 ఎకరాల్లో, కంది 2,800 ఎకరాలు, మిరప 435 ఎకరాలు, సోయాబీన్ 944 ఎకరాలు, పెసర 187 ఎకరాలు, ఆయిల్ పాం 832 ఎకరాలు, కూరగాయలు 183 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ సేకరించిన సాగు వివరాలను రాష్ట్ర వ్యవసాయ శాఖకు నివేదించారు.

సాగు వివరాలు ఆన్‌లైన్‌లో..

జిల్లాలోని 71 క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయి పర్యటనలు చేసిన వ్యవసాయ శాఖ ఏఈఓలు రైతుల నుంచి పంట సాగు వివరాలు తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పంట అమ్మకంలో ఇబ్బందులు తలెత్తకుండా సాగు వివరాలను అధికారులు సేకరించారు. జిల్లాలో ఈసారి వర్షాలు ఎక్కువగా కురవడంతో బావుల్లో పుష్కలంగా నీరు చేరింది. ఫలితంగా పంటల సాగు గణనీయంగా పెరిగింది. అధిక వర్షాలతో మొక్కజొన్న, పెసర, కంది, పత్తి వంటి పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురువడంతో ఆరుతడి పంటల సాగులో లోటు ఏర్పడింది.


మెట్‌పల్లిలో అత్యధికం.. జగిత్యాల అర్బన్‌లో అత్యల్పం

వానాకాలం సీజన్‌లో వివిధ పంటల సాగు విస్తీర్ణం చూస్తే మెట్‌పల్లి మండలంలో 36,419 ఎకరాల్లో అత్యధికంగా ఉండగా.. అత్యల్పంగా జగిత్యాల అర్బన్ మండలంలో 4,402 ఎకరాలుగా ఉంది. మండలాల వారీగా చూస్తే బీర్‌పూర్‌లో 16,434 ఎకరాలు, బుగ్గారంలో 14,211, ధర్మపురిలో 32,465, ఎండపల్లిలో 16,065, గొల్లపల్లిలో 29,248, ఇబ్రహీంపట్నంలో 27,778, జగిత్యాల అర్బన్‌లో 4,402, జగిత్యాల రూరల్‌లో 27,462, కథలాపూర్‌లో 29,110, కొడిమ్యాలలో 22,519, కోరుట్లలో 24,596, మల్లాపూర్‌లో 34,997, మల్యాలలో 16,792, మేడిపల్లిలో 31,468, మెట్‌పల్లిలో 36,419, పెగడపల్లిలో 24,245, రాయికల్‌లో 28,787, సారంగాపూర్‌లో 14,699, వెల్గటూర్‌లో 15,946 ఎకరాల్లో పంటలు సాగు చేసారు.

పుష్కలంగా సాగునీరు

జిల్లాలో ఒకటి, రెండు మినహా అన్ని మండలాలకు సాగు నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఈఏడు వర్షాలు కూడా విరివిగా కురవడంతో నీటికి ఢోకా లేకుండా పోయింది. భూగర్భజలాలు 3 నుంచి 4మీటర్ల లోతులోనే ఉన్నాయి. బావులు నిండాయి. చెరువులు, కుంటలు పొంగాయి. దీంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ప్రధానంగా మామిడితోటలతో పాటు వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. ప్రతి పంటలో ఇక్కడి రైతులు అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తుండటంతో మంచి దిగుబడులు సైతం తీస్తున్నారు. జిల్లాలో బీడు భూములు కనబడటమే కష్టంగా మారింది.

సాగు విస్తీర్ణం పెరిగింది



జిల్లాలో పుష్కలంగా నీటి వనరులు ఉండటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లాలో 4.47 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా.. అందులో వరి పంటే 3.07 లక్షల ఎకరాలుగా ఉంది. ఈసారి వర్షాలతో ఆరుతడి పంటలు ఎదుగుదల లోపించి దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

– పాక సురేష్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

విద్యార్థి కిడ్నాప్‌నకు యత్నం

- గొర్రెల కాపరి అడ్డుకోవడంతో వదిలివెళ్లిన దుండగులు
- వేములకుర్తిలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన


రక్షిత్

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో దుండగులు ఓ విద్యార్థిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో ఆ బాలుడి తల్లిదండ్రులు భయపడుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. వేములకుర్తికి చెందిన గుడ్ల రాజేందర్–సుమలత దంపతుల కుమారుడు రక్షిత్ స్థానిక ప్రాథమిక పాఠశాలలో మూడోతరగతి చదువుతున్నాడు. గత మంగళవారం పాఠశాలకు వెళ్లిన బాలుడు మధ్యాహ్న భోజన సమయంలో బయటకు వచ్చాడు. అప్పుడే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ మహిళ, మరో వ్యక్తి అతనికి చాక్లెట్ ఇస్తామని చెప్పి, తీసుకెళ్లారు. ఊరచెరువు కట్ట రోడ్డు నుంచి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన ఓ గొర్రెల కాపరి బాలుడి కేకలు విని, అడ్డుకున్నాడు. దీంతో దుండగులు బాలుడిని వదిలి వెళ్లిపోయారు. పాఠశాల హెచ్ఎం నవీన్‌కు అదేరోజు సాయంత్రం విషయం తెలుపగా ఆయన రక్షిత్ కుటుంబసభ్యులకు చేరవేశారు. బుధవారం బాలుడి తల్లిదండ్రులు, గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. బాలుడిని క్షుద్రపూజల కోసమే కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని అనుమానించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జ్వరంతో యువకుడి మృతి


రాజు (ఫైల్)

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్లకు చెందిన పుల్ల రాజు(28) జ్వరంతో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రాజు గ్రామంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. స్థానిక ఓ ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స తీసుకున్నాడు. అయినప్పటికీ తగ్గకపోగా పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబసభ్యులు గురువారం మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నిజామాబాద్‌లోని హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య సంజన, కుమారుడు, కూతురు ఉన్నారు.

హత్య కేసు నిందితులపై పీడీయాక్టు?

కోరుట్ల: స్థానిక బీఆర్ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజం హత్య కేసులో నిందితులపై పీడీయాక్టు అమలుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మొత్తం 9 మందిలో ముగ్గురిపై ఇదివరకే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు హత్యలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. మిగిలినవారు కోరుట్ల పరిసరాల్లో అడపాదడపా గొడవలు, అల్లర్లు చేసినట్లు పోలీసులు ధ్రువీకరించారు. ఈ క్రమంలో లక్ష్మీరాజం హత్య కేసులో ఉన్న వీరందరిపై పీడీయాక్టు అమలుకు కలెక్టర్ అనుమతి తీసుకోనున్నట్లు సమాచారం. అదే జరిగితే నిందితులకు మూడు నెలల నుంచి ఏడాదిపాటు బెయిల్ వచ్చే అవకాశాలు ఉండవని తెలిసింది.

'ఆరు గ్యారంటీలతో అధికారం ఖాయం'

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలతో అధికారంలోకి రావడం ఖాయమని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు. ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయని పేర్కొన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పాలనే శ్రీరామ రక్ష అన్నారు. బీఆర్ఎస్‌కు మరోసారి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తారని తెలిపారు. మహిళా నాయకులు భూక్యా సరళ, సరిత, మమత, మాధవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టుబట్టారు.. కొలువు కొట్టారు

- కానిస్టేబుల్ ఉద్యోగాలకు యువత ఎంపిక
- కల సాకారం చేసుకున్న పేదింటి కుసుమాలు



గొల్లపల్లి: మండలానికి చెందిన 9 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న కసితో పట్టుబట్టి, కొలువు కొట్టారు. లక్ష్యాన్ని చేరుకున్న పేదింటి కుసుమాలు తమ కల సాకారం చేసుకున్నారు. దీంతో వారి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

భీంరాజ్‌పల్లి నుంచి 35 ఏళ్లకు కొలువు


అనిల్‌కుమార్

గొల్లపల్లి మండలంలోని భీంరాజ్‌పల్లికి చెందిన సింగారపు మల్లేశం–లక్ష్మి దంపతుల కుమారుడు అనిల్‌కుమార్ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. 35 ఏళ్లకు ముందు ఈ గ్రామంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. వీరిలో ఒకరి కుమారుడు టీచర్. మరొకరి కుమారుడు రెవెన్యూ ఉన్నత ఉద్యోగి(రిటైర్డ్). వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. ఆ తర్వాత గ్రామంలో ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం కొట్టలేదు. ఇన్నేళ్లకు అనిల్‌కుమార్ సాధించాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఆసరాగా ఉంటూనే తన బావ గాజినవేని చందు ప్రోత్సాహంతో హైదరాబాద్‌లో అద్దె గదిలో ఉంటూ చదివి కానిస్టేబుల్‌కు ఎంపికయ్యాడు.

తండ్రి కల నెరవేర్చిన కూతురు


జక్కుల శిరీష

చందోలి గ్రామానికి చెందిన జక్కుల సుగుణ–నర్సయ్య దంపతుల చివరి సంతానం శిరీష ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఆమె అన్న ప్రశాంత్, అక్క స్రవంతి గతంలో ఏఈవో ఉద్యోగం సాధించారు. తండ్రి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ తమను చదివించాడని ఆమె తెలిపింది. ఏడాది క్రితం ఆయన మృతిచెందడం తీవ్ర బాధను మిగిల్చిందని పేర్కొంది. తండ్రికి నేను ప్రభుత్వ ఉద్యోగం చేయాలని కల ఉండేదని, దాన్ని నెరవేర్చినందుకు సంతోషంగా ఉందని తెలిపింది.

మూడో ప్రయత్నంలో ఉద్యోగం


మహేందర్

చందోలి గ్రామానికి చెందిన దామరకొండ బీరయ్య–రమాదేవి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు సంతానం. వీరిలో మూడో కుమారుడు మహేందర్ ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న బీరయ్య తన పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. రెండో కూతురు వనిత రామగుండం జెన్‌కో అసిస్టెంట్ ఇంజినీర్. రెండుసార్లు విఫలమైనా మూడో ప్రయత్నంలో ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉందన్నాడు.

అన్నావదిన దీవెనలతోనే..


రాజశేఖర్

దట్నూర్‌కు చెందిన పారిపెల్లి నారాయణ–లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు చిరంజీవి, రాజశేఖర్. తల్లిదండ్రులిద్దరూ గతంలోనే చనిపోయారు. దీంతో తమ్ముడి బాధ్యత అన్న చిరంజీవిపై పడింది. ఎకరం పొలం సాగు చేస్తూ అతన్ని ఎమ్మెస్సీ ఫిజిక్స్ చదివించాడు. రైల్వే శాఖలో ఉద్యోగం చేస్తూనే ఏడాది క్రితం సింగరేణి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కోర్టు కేసు ఉండటంతో ఖాళీగా ఉండలేక సివిల్ కానిస్టేబుల్ పరీక్ష రాసి, ఎంపికయ్యాడు. గ్రూప్–1, గ్రూప్–2 కూడా రాస్తానని, డిప్యూటీ కలెక్టర్ కావడం తమ లక్ష్యమని తెలిపాడు. అన్నావదిన దీవెనల వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని అన్నాడు.

లైబ్రరీలో పుస్తకాలు చదివి..


నూకల సురేశ్

చెందోళికి చెందిన నూకల సురేశ్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. తలిదండ్రులు వ్యవసాయ కూలీలు. ఇతనికి ఇద్దరు అన్నలు, ఒక అక్క ఉన్నారు. కుటుంబ పరిస్థితిని మార్చాలనుకొని, కరీంనగర్‌లో అద్దెకు ఉంటూ మార్నింగ్ ఛాయ్‌తో సరిపెట్టుకొని, మధ్యాహ్నం లైబ్రరీ క్యాంటీన్‌లో రూ.5 భోజనం చేశాడు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా లైబ్రరీలోని పుస్తకాలనే చదివాడు. మొదటి ప్రయత్నంలో విఫలమైనా రెండోసారి ఉద్యోగం సాధించానని తెలిపాడు.

గల్ఫ్ కార్మికుడి కుమారుడు..


సతీశ్

చెందోళికి చెందిన మామిడాల లచ్చయ్య–వెంకవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. రెండో కుమారుడు సతీశ్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ కొలువు కొట్టాడు. ఉపాధి కోసం ఉన్న ఊరిని వదిలి, లచ్చయ్య 12 ఏళ్లుగా గల్ఫ్‌బాట పట్టాడు. తనకు వచ్చిన చాలీచాలని వేతనంతో పిల్లలను చదివిస్తున్నాడు. చిన్న కుమారుడు హరీశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సతీశ్ ఎస్సై పోస్టుకు అర్హత సాధించలేక పోయాడు. కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. ఎస్సై కొలువు కొట్టడం తన లక్ష్యమని తెలిపాడు.

కోచింగ్ తీసుకోలేదు..


సాగర్

దట్నూర్‌కు చెందిన మందపెల్లి రాజయ్య–రాజేశ్వరి దంపతుల పెద్ద కుమారుడు సాగర్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. తండ్రి చిల్వాకోడూర్ చౌరస్తా వద్ద సెలూన్ నిర్వహిస్తూ ఇద్దరు కుమారులను చదివించాడు. సాగర్ కరీంనగర్‌లో అద్దెకు ఉంటూ ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. మొదటి, రెండుసార్లు విఫలమై, మూడో ప్రయత్నంలో కొలువు కొట్టాడు.

ఇంటి వద్దే ఉండి ప్రిపరేషన్..


అనిల్

దట్నూర్ గ్రామానికి చెందిన బెక్కం రవి–నర్సవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు అనిల్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. కోచింగ్ తీసుకోకుండా ఇంటి వద్దే ఉండి, చదివానని, మొదటి ప్రయత్నంలో విఫలమైనా రెండో ప్రయత్నంలో ఉద్యోగం సాధించినట్లు చెప్పాడు. ఎస్సైగా ఎంపికవడమే తన లక్ష్యమన్నాడు.

ఎస్సై ఉద్యోగం సాధించడమే లక్ష్యం


సాయికుమార్

అబ్బాపూర్‌కు చెందిన చెవుల సాయికుమార్ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. తండ్రి పోచయ్య, తల్లి కలవ్వ కూలీ పని చేసిన కుమారుడిని చదివించారు. ఇటీవల ఎస్సై ఉద్యోగం మూడు మార్కులతో కోల్పోయాడు. శిక్షణ తీసుకోకుండానే చదివి, కానిస్టేబుల్‌గా ఎంపికవడం ఆనందంగా ఉందని తెలిపాడు. ఎస్సై ఉద్యోగం సాధించాలన్నది తన తండ్రి కల అని, దాన్ని నెరవేరుస్తానన్నాడు.


అనుదీప్ సతీశ్ ప్రేమ్‌సాగర్ మహిపాల్‌రెడ్డి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయికి చెందిన చెట్ల అనుదీప్ ఏఆర్ కానిస్టేబుల్ కొలువు కొట్టాడు. అతని తల్లితండ్రులు జమున–సత్తన్న గీత వృత్తితోపాటు వ్యవసాయం చేస్తుంటారు. సిగిరి ప్రేమ్‌సాగర్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇతని తండ్రి రత్నాకర్ చనిపోగా, తల్లి మల్లీశ్వరి వ్యవసాయం చేస్తోంది. గాజర్ల సతీశ్ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఇతని తల్లిదండ్రులు లక్ష్మి–తిరుపతి గీత వృత్తితోపాటు, వ్యవసాయం చేస్తుంటారు. తుంగూర్‌కు చెందిన బెత్తెపు సంజయ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ కొలువు కొట్టాడు. అమ్మానాన్న లక్ష్మి–మల్లయ్య వ్యవసాయం చేస్తున్నారు. చిక్కుల్ల సూర్యతేజ సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యాడు. అమ్మానాన్న సంధ్య–రమేశ్ వ్యవసాయం చేస్తున్నారు. సారంగాపూర్ మండలంలోని అర్పపల్లికి చెందిన దమ్మ మహిపాల్‌రెడ్డి ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. అమ్మానాన్న గంగవ్వ–రాజిరెడ్డి వ్యవసాయం చేస్తుంటారు.


రాకేశ్


శశికుమార్


వినోద్

జగిత్యాలరూరల్: జాబితాపూర్‌కు చెందిన ముగ్గురు యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. మొగిలిపాలెం రాకేశ్ ఎంకామ్ పూర్తి చేసి, టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగానికి, నీలం వినోద్ బీటెక్ పూర్తి చేసి, ఐటీ కానిస్టేబుల్, హన్మాండ్ల శశికుమార్ ఎంబీఏ పూర్తి చేసి, టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు.


సంతోష్‌రెడ్డి


సాయిరెడ్డి


మనోహర్


శేఖర్‌నాయక్


వసంత

పెగడపల్లి: బతికపల్లికి చెందిన నాగిరెడ్డి సంతోష్‌రెడ్డి, అయితిపల్లికి చెందిన కట్కూరి సాయిరెడ్డి, పెగడపల్లికి చెందిన బైర మనోహర్ సివిల్ కానిస్టేబుళ్లుగా, రాజారాంపల్లి తండాకు చెందిన ఇస్లావత్ శేఖర్‌నాయక్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్, ఆరవెల్లికి చెందిన మానుపాటి వసంత ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. వీరిని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందిన వడకాపురం నరేశ్, మద్ది సనత్‌లు సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. నరేశ్ తండ్రి గ్రామంలో వడ్రంగిగా పని చేస్తుండగా తల్లి గృహిణి. ముగ్గురు కుమారుల సంతానంలో రెండోవాడైన నరేశ్ కష్టపడి చదివి తల్లిదండ్రుల కల నెరవేర్చాడు. సనత్ తండ్రి మురళీధర్ ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ గత నెలలో అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి మరణించిన బాధలో ఉన్న కుటుంబంలో సనత్ కానిస్టేబుల్‌గా ఎంపికవడం ఆనందం నింపింది. గురువారం సర్పంచ్ మురళిగౌడ్ వారిని సన్మానించారు.



నరేశ్, సనత్‌లను సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

రెండో ప్రయత్నంలో కొలువు


రవీశ్‌రెడ్డి

రాయికల్: భూపతిపూర్‌కు చెందిన కోమటిరెడ్డి భాగ్య–రాజిరెడ్డి దంపతుల కుమారుడు రవీశ్‌రెడ్డి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. నాన్న చనిపోయాడని, అమ్మ వ్యవసాయం చేస్తోందని తెలిపాడు. తాను డిగ్రీ వరకు చదివానని, రెండో ప్రయత్నంలో సివిల్ కానిస్టేబుల్ కొలువుకు ఎంపికైనట్లు పేర్కొన్నాడు.

గ్రూప్–డి ఉద్యోగం వదిలేసి..


శ్రీకాంత్

రాయికల్: తాట్లవాయికి చెందిన గుగ్గిళ్ల రాజేశ్వరి–గంగారాం దంపతుల కుమారుడు శ్రీకాంత్ టీఎస్‌పీఎస్సీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నాన్న వ్యవసాయ కూలీ, అమ్మ బీడీ కార్మికురాలని తెలిపాడు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివిన తాను ఆర్ఆర్‌బీలో గ్రూప్–డి ఉద్యోగం వదిలేశానన్నాడు. మొదటి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ కొలువు సాధించినట్లు పేర్కొన్నాడు.

వ్యవసాయ కుటుంబం


తిరుపతిరెడ్డి

రాయికల్: భూపతిపూర్‌కు చెందిన నలిమెల్లి పెద్దిరెడ్డి–సత్తమ్మ దంపతుల కుమారుడు తిరుపతిరెడ్డి టీఎస్‌పీఎస్సీ ఉద్యోగం సాధించాడు. అమ్మానాన్న వ్యవసాయం చేస్తున్నారని తెలిపాడు. తాను డిగ్రీ వరకు చదివి, రెండో ప్రయత్నంలో టీఎస్‌పీఎస్సీ ఉద్యోగం సాధించానని పేర్కొన్నాడు.

హైదరాబాద్‌లో ప్రిపేర్ అయ్యా


వంశీ

రాయికల్: తాట్లవాయి గ్రామానికి చెందిన మదికుట్ల గంగారాం–రాజు దంపతుల కుమారుడు వంశీ టీఎస్‌పీఎస్సీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తాను డిగ్రీ వరకు చదివి, హైదరాబాద్‌లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రిపేర్ అయ్యానని తెలిపాడు. ఎలాంటి కోచింగ్ లేకుండా మొదటి ప్రయత్నంలోనే కొలువు కొట్టినట్లు పేర్కొన్నాడు.

నాన్న కూలీ, అమ్మ బీడీ కార్మికురాలు


రఘు

రాయికల్: కుమ్మరిపల్లికి చెందిన కల్లెడ రాజేందర్ కుమారుడు రఘు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగం సాధించాడు. నాన్న వ్యవసాయ కూలీ కాగా అమ్మ బీడీలు చుడుతోందని తెలిపాడు. డిగ్రీ వరకు చదివిన తాను ఎలాంటి కోచింగ్ లేకుండా రెండో ప్రయత్నంలో ఉద్యోగానికి ఎంపికయ్యానని చెప్పాడు.

నా కల నెరవేరింది..


జీవన్

బుగ్గారం: నాన్న చిన్నప్పుడే చనిపోవడంతో మా అమ్మ, అన్నయ్యలే నన్ను ఉన్నత చదువులు చదివించారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోకాలంగా శ్రమిస్తున్నా. ఎస్సై కొలువు తృటిలో చేజారింది. కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాలని కష్టపడ్డాను. నా కల నెరవేరింది.


వినయ్


రోహిత్


మణిదీప్


సతీశ్


ప్రణయ్, సాయికుమార్‌లను సన్మానిస్తున్న రాజు

కోరుట్ల రూరల్: మండలంలోని పేదిమడుగుకు చెందిన దుంపాల వినయ్, అరిసె రోహిత్, దొమ్మటి మణిదీప్, మోహన్‌రావుపేటకు చెందిన బంచ సతీశ్, పట్టణానికి చెందిన ఎడ్ల ప్రణయ్‌కుమార్, చిట్యాల సాయికుమార్‌లు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. వినయ్, సతీశ్, సాయికుమార్, ప్రణయ్ టీఎస్ఎస్పీ, మణిదీప్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, రోహిత్ ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. వీరిని స్థానిక ప్రజా ప్రతినిదులు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కొంతం రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంతం రాజం అభినందించారు.


ప్రశాంత్‌గౌడ్


శశికుమార్


కల్లెం మహిపాల్


కూసరి మహిపాల్

మల్యాల: మండలంలోని తాటిపల్లి ఉప సర్పంచ్ పొన్నం జమున–మల్లేశం దంపతుల రెండో కుమారుడు ప్రశాంత్ గౌడ్ ఏఆర్ కానిస్టేబుల్‌గా, బెజ్జంకి గౌరవ్వ–దుర్గయ్య దంపతుల కుమారుడు శశికుమార్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్‌గా, మద్దుట్లకు చెందిన కూసరి మల్లమ్మ కుమారుడు మహిపాల్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. తాటిపల్లి అనుబంధ గ్రామం కొంపల్లెకు చెందిన కల్లెం కమల–గంగారాం కుమారుడు మహేందర్ జైల్ వార్డెన్, అదే గ్రామానికి చెందిన పత్రి లక్ష్మి–రాజారాం దంపతుల కుమారుడు అంజి ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్, దొంగ సాయి టీఎస్ఎస్పీ కానిస్టేబుల్, పోతారం గ్రామానికి చెందిన నిమ్మ అజయ్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్, తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన సుల్తాన్ నరేశ్ టీఎస్ఎస్పీ, కాసం శరత్ టీఎస్ఎస్పీ, సంగం శ్రీనివాస్ టీఎస్ఎస్పీ, లంబాడిపల్లి కొండ్ర సురేశ్ ఏఆర్ కానిస్టేబుల్, శివ ఏఆర్ కానిస్టేబుల్, తొట్ల పవన్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్, బల్వంతాపూర్ మహేశ్ టీఎస్ఎస్పీ, తాటిపల్లి వినోద్ ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

పదోన్నతి తర్వాతే బదిలీ చేపట్టాలి

మల్లాపూర్: ఉపాధ్యాయులకు పదోన్నతుల తర్వాతే బదిలీ చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నునావత్ రాజు అన్నారు. మండలంలోని కుస్తాపూర్‌లో మాట్లాడారు. 8 ఏళ్లుగా పదోన్నతి లేక వేలాది మంది ఉపాధ్యాయులు నష్టపోయారని, జీవో నంబర్ 5 ప్రకారం అర్హత కలిగిన సెంకడరీ గ్రేడ్ టీచర్లతోపాటు భాషపండితులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాకే బదిలీలు నిర్వహిస్తేనే సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిలేటి ఎల్లయ్య, సభ్యులు జరుపుల గోవింద్ నాయక్, సూదిగిరాల గణేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతపై కేసు

రాయికల్: మండలంలోని ధర్మాజీపేటకు చెందిన పాలకుర్తి వీరమ్మ గురువారం గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: పట్టణంలో రూ.10కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు గురువారం శిలాఫలకాలు ఆవిష్కరించారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ రాజేశ్వర్, వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.